క్లుప్తంగా

ఐటీఐల్లో ప్రవేశాలకు ఆహ్వానం

ఏటూరునాగారం : ములుగు జిల్లాలోని ఏటూరునాగారం, వాజేడు ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం మూడో విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏటూరునాగారం ఆర్ ఐటీఐ ప్రిన్సిపాల్ యస్.జగన్‌మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 2 నుంచి 12వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకో వాలని, వారి జాబితా ప్రకారం ఐటీఐల్లో అడ్మిషన్లు ఇస్తామని తెలిపారు. ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, వెల్డర్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్(సివిల్) కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

యువతకు స్వయం ఉపాధి కల్పించాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని యువతకు స్వయం ఉపాధి కోసం రుణాలు మంజూరు చేయాలని సీతక్క యువసేన జిల్లా అధ్యక్షుడు చర్పా రవీందర్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ భవన్‌లో రాష్ట్ర ట్రైకార్ జనరల్ మేనేజర్ కుంజా శంకర్ రావును కలిసి రవీందర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ తమ పరిధిలో ఉన్న ట్రైకార్, గిరివికాస్, మైక్రో ఇండస్ట్రీ, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ పథకాల కింద రుణాలు మంజూరు చేసి ఉపాధి కల్పించాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి స్వయం ఉపాధి రుణాలు ఇవ్వకుండా ఉండటం వలన యువత మొత్తం నిర్వీర్యం అయిందన్నారు. స్వయం ఉపాధి కోసం రుణాలు మంజూరు చేసి అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

ములుగు: రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భూక్యా జంపన్న కోరారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మాట్లాడుతూ 2024–25 సవత్సర బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.72,659 కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఇందులో రూ.2 లక్షల రైతు రుణమాఫీకి రూ.26 వేల కోట్లు, రైతు భరోసాకు రూ. 15 వేల కోట్లు రైతు బీమాకు కేటాయింపులు ఉన్నట్లు తెలిపారు. రుణమాఫీలో కొంతమంది రైతులకు మాఫీ కావడం లేదని రేషన్ కార్డు, పట్టాపాస్ పుస్తకం ఉన్న వారికి రుణమాఫీ వస్తుందన్నారు. ములుగు ఏజెన్సీలో 50 శాతం మంది రైతులకు పట్టాలు కాలేదని పహాణీల ద్వారానే బ్యాంకుల నుంచి రుణాలను తీసుకోవడం జరిగిందన్నారు.

రేపు వాలీబాల్ పోటీలు

వెంకటాపురం(కె) : ఈ నెల 4వ తేదీన స్థానిక పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎస్సై కొప్పుల తిరుపతిరావు శుక్రవారం తెలిపారు. ఈ పోటీల్లో మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఒక్క టీం చొప్పున నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తమ పేర్లను నమోదు చేయించు కోవాలని కోరారు. గెలుపొందిన విజేతలు డివిజన్, జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. విజేతలైన మూడు టీంలకు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు.

యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలి

గోవిందరావుపేట: మండలంలోని అన్ని గ్రామాల్లోని యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జరిగే వాల్‌బాల్ పోటీలు ఉన్నందున ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. గెలిచిన యువతకు బహుమతితో పాటు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని ఎస్సై పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారు తమ టీమ్ సభ్యులతో కలిసి పస్రా పోలీస్‌స్టేషన్‌లో ఆగస్టు 3 నుంచి 6వ తేదీ మధ్యలో 87125 30189, 87125 30410 నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోగలరని తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ములుగు: తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ములుగు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కాంగ్రెస్ నాయకులు బాదం ప్రవీణ్, కుక్కల నాగరాజు మాట్లాడుతూ గత పాలకులు ప్రకటనలే పరిమితమై కళాకారులను విస్మరించారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 30 శాతం పీఆర్‌సీ ఇచ్చి కళాకారుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

- మండల ప్రత్యేక అధికారి రమాపతి, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి రమాపతి

ఏటూరునాగారం: ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని, ఎవరూ సెలవులు పెట్టకూడదని మండల ప్రత్యేక అధికారి రమాపతి, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులు, ఏపీఎం, పంచాయతీ కార్యదర్శులతో 'స్వచ్ఛదనం–పచ్చదనం'పై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల అధికారి రమాపతి అన్ని గ్రామ పంచాయతీలలో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి తెలియజేశారు. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు కొనసాగనున్న 'స్వచ్ఛదనం – పచ్చదనం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన నివేదికలను రోజువారీగా సమర్పించాలని వారు ఆదేశించారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వీలుగా అందరినీ భాగస్వాములు చేస్తూ స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం ప్రారంభం రోజున ఎక్కడికక్కడ ర్యాలీలు నిర్వహించాలని తెలిపారు. అలసత్వం ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీఓ కుమార్. డిప్యూటీ రేంజ్ అధికారి నరేందర్, ఐకేపీ ఏపీఎం సతీష్, ఏపీఓ చరణ్ రాజు, సీడీపీఓ ప్రేమలత, గ్రామ పంచాయతీ కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



ములుగు రూరల్: వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై వెంకటేశ్వర్‌రావు



వాజేడు: బ్యాగులు సోదా చేస్తున్న పోలీసులు

ములుగు రూరల్: జాతీయ రహదారిపై పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. శుక్రవారం మండలంలోని జంగాలపల్లి వద్ద ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు సరైన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేపట్టాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపినట్లయితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రహదారిపై వెళ్లి వాహనాలను నిలిపి వివరాలు సేకరించి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దులో వాహన తనిఖీలు

వాజేడు: తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. జాతీయ రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మావోయిస్టు వారోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ తనిఖీలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. వాహనాలను తనిఖీ చేయడంతో పాటు అందులోని బ్యాగులను సోదాలు చేశారు. ప్రత్యేకంగా ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న ప్రతీ వాహనాన్ని సోదా చేసి ప్రయాణికుల వివరాలను సేకరించారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్



వెంకటాపురం(ఎం): పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ మాజీ సర్పంచ్‌లు చలో సెక్రటేరియట్‌కు శుక్రవారం పిలుపునివ్వడంతో మండలం నుంచి మాజీ సర్పంచ్‌లు తరలివెళ్లకుండా శుక్రవారం తెల్లవారుజామున ముందస్తుగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మధ్యాహ్నం తర్వాత సొంత పూచీకత్తుపై వదిలిపెట్టినట్లు మాజీ సర్పంచులు మేడబోయిన అశోక్, మేకల మహేందర్, జగన్‌మోహన్‌రావు, కుమారస్వామిలు తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

కాటారం: విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ నాగరాజు తెలిపారు. మండలంలోని గంగారం, గట్లకుంట గ్రామాల్లో శుక్రవారం ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పంట పొలాల్లోని రైతుల వద్దకు వెళ్లిన అధికారులు విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లను పరిశీలించారు. లూస్ లైన్స్, టీల్ట్ పోల్స్ సరిచేస్తున్నట్లు వివరించారు. రైతులకు ఏవైనా విద్యుత్ సమస్యలు ఎదురైతే వెంటనే సమాచారం అందించాలని ఏడీఈ కోరారు.

వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

వెంకటాపురం(కె): మండలంలోని మల్లాపురం, రాచపల్లి, మొర్రవానిగూడెం, రామచంద్రాపురం గ్రామాల్లో శుక్రవారం వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రామాల్లో డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నిల్వ ఉన్న మురుగు నీటిని తొలగించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కృష్ణ, ఆశిష్, విజయ్, సిబ్బంది జ్యోతి, మహేందర్, కోటి రెడ్డి, యాకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబురాలు



వెంకటాపురం(ఎం): తాళ్లపహాడ్‌లో సంబురాలు జరుపుకుంటున్న నాయకులు



ఎస్ఎస్‌తాడ్వాయిలో..



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

వెంకటాపురం(ఎం): ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఆమోదం తెలుపడంతో మండల కేంద్రంలోని తాళ్లపహాడ్ వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు బాణసంచా పేల్చి సంబురాలు జరుపుకున్నారు. మంద కృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాటం మూలంగానే ఎస్సీ వర్గీకరణ జరుగుతుందని ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి కాడపాక శ్యాం పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు దొమ్మటి రమేష్, భద్రయ్య, రవి, రమేష్, లింగస్వామి, రాజేందర్, శ్రీనివాస్, భాస్కర్, కిరణ్, అశోక్, రాజు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

ఎస్ఎస్‌తాడ్వాయి : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు చారిత్రాత్మిక తీర్పు ఇవ్వడం హర్షణీయమని ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి గజ్జల ప్రసాద్ అన్నారు. ఏబీసీడీ వర్గీకరణ తీర్పును వెల్లడించిన నేపథ్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని జా తీయ రహదారి నాయకులు బాణసంచాలు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు కృషి చేసిన మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30ఏళ్ల పోరాట ఫలితంగా మంద కృష్ణ మాదిగ కల నెరవేరిందన్నారు. కార్యక్రమంలో ఎమార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గజ్జల ప్రశాంత్, కాటాపూర్ మాజీ సర్పంచ్ పుల్లూరి గౌరమ్మ, మండల అధ్యక్షుడు నరేందర్, జిల్లానాయకులు పురుషోత్తం నారాయణ, సమ్మయ్య, నర్సయ్య, చిన్నసమ్మయ్య, నరేష్, సంపత్, రాంబాబు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలి

వెంకటాపురం(కె): మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ సాధించే వరకు పోరాటం సాగించాలని మాదిగ జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు యాసం రమేశ్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో మాదిగ జేఏసీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 సంవత్సరాలుగా మాదిగలు పోరాటం చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక అంబ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు తోకల అంజి, చెన్నం గౌతమ్, రమేష్, కోగిల ప్రవీణ్, సమ్మయ్య, నవీన్, నాగార్జున తదితరులు ఉన్నారు.

యువత వ్యసనాలకు బానిస కావొద్దు

వెంకటాపురం(కె): యువత చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని స్థానిక సీఐ బండారి కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని సూచించారు. అన్ని రంగాల్లో ముందంజలో ఉండి చదువు నేర్పిన గురువులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతిరావు. జూనియర్ కాలేజి అకడమిక్ ఇన్‌చార్జ్ అమ్మిన శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ బండారి కుమార్

తపాలాశాఖ పథకాలపై అవగాహన

మొగుళ్లపల్లి: మండలంలోని మెదరమెట్ల గ్రామంలో తపాలాశాఖ ఆధ్వర్యంలో గ్రామీణ తపాలా జీవిత పథకాల గురించి ఆ శాఖ పరకాల సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అనంత రామ్ నాయక్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తపాలా శాఖ ద్వారా అందజేస్తున్న సేవలను ప్రజలందరూ వినియోగించుకుని లబ్ధి పొందాలన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

వాజేడు: ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కొమరం భీమ్ విగ్రహం వద్ద సమావేశాన్ని ఏర్పాటు చేసి వారు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కోసం అన్ని ఆదివాసీ సంఘాలు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. సమావేశంలో పాయం జానకి రమణ, బుచ్చయ్య, సర్వేశ్వరావు, సురేష్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ సంఘం నాయకులు

అర్ధరాత్రి అరెస్టు దారుణం



మాట్లాడుతున్న పూసం నరేశ్

వాజేడు: అసెంబ్లీ ముట్టడి ఉందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులను రాష్ట్రవ్యాప్తంగా అరెస్టు చేయడం అక్రమమని మండల సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ సభ్యుడు పూసం నరేశ్ శుక్రవారం ఖండించారు. అర్ధరాత్రి దాటాక ఇంటికి వచ్చి అరెస్టు చేయడం దారుణ మన్నారు. తాము మాజీ ప్రజాప్రతినిధులమా లేక ఉగ్ర వాదులమా అని ప్రశ్నించారు. అక్రమ అరెస్టుల ద్వారా కాంగ్రెస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం ఎదురవుతుందన్నారు. ఇకనైనా ఇలాంటి దుశ్చర్యలను మానుకోవాలని సూచించారు. సమావేశంలో జెజ్జరి మేనక, పూనం నాగచంద్ర, వాసం మల్లీశ్వరి పాల్గొన్నారు.

వర్షానికి ఇంటిపై కూలిన చెట్టు



నర్సింహులు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీఎం బృందం

ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెం గ్రామంలో గురువారం రాత్రి కురిసిన గాలివానకు ఇంటిపై చెట్టు కూలి ఇల్లు నేల మట్టమైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రామన్నగూడెం గ్రామానికి చెందిన బండారు నర్సింహులు ఇంటిపై గాలి వానకు ఇంటిపక్కన ఉన్న వేపచెట్టు కూలి ఇంటిపై పడి ఇల్లు నేలమట్టమైందని తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఇంట్లో ఉన్న వస్తువులు అన్ని ధ్వంసమయ్యాయని తెలిపారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

ఇంటిపై చెట్టు కూలి ఇల్లు ధ్వంసమైన నర్సింహులు కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దావూద్ అన్నారు. శుక్రవారం సీపీఎం బృందం రామన్నగూడెంలోని నర్సింహులు ఇంటిని పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం రాత్రి కురిసిన వర్షానికి పెద్ద వేప చెట్టు కూలి ఇంటి పై పడి ఇల్లు ధ్వంసం కావడంతో పాటు విలువైన వస్తువులు ధ్వంసమయ్యాయని అన్నారు. రెవెన్యూ అధికారులకు బాధితులు సమాచారం ఇచ్చిన పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు నష్ట పరిహారం అందజేసి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వసంతం, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



మంగపేట : ఆర్థిక సాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



గోవిందరావుపేట : ఆర్థికసాయం అందజేస్తున్న కాలనీవాసులు

మంగపేట: మండలంలోని రమణక్కపేటలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తోకల సంతోష్ కుటుంబాన్ని కాంగ్రెస్ మండల నాయకులు శుక్రవారం పరామర్శించి ఆర్థికసాయం అందచేశారు. మృతుడి దశదినకర్మ కార్యక్రమానికి ఖర్చుల నిమిత్తం మంత్రి సీతక్క, కాంగ్రెస్ జిల్లా అధక్షుడు పైడాకుల అశోక్ ఆదేశాల మేరకు రాష్ట్ర యువజన కాంగ్రెస్ సెక్రటరీ ధనసరి సూర్య చేయూతతో రూ.5వేల నగదును బాధిత కుటుంబానికి అందచేశారు. అందజేసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి కోడం బాలకృష్ణ, బీసీ సెల్ మండల అధక్షుడు ముత్తినేని ఆదినారాయణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొంకతి సాంబశివరావు, గ్రామకమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్, సత్యనారాయణ, లవకుమార్ పాల్గొన్నారు.

గోవిందరావుపేట : మండలంలోని పస్రా గ్రామం అభ్యుదయ కాలనీలోని ఓ నిరుపేద కుటుంబానికి కాలనీవాసులు అందరూ కలిసి ఆర్థికసాయం చేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. అభ్యుదయ కాలనీకి చెందిన ఎల్లాముల గురువయ్య ఇటీవలె అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో పూర్తిగా దిక్కులేని దీనస్థితిలో ఉన్న ఆ కుటుంబానికి కాలనీవాసులు అండగా నిలబడి రూ.15 వేల ఆర్థిక సాయం చేశారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

వాజేడు : గ్రామస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సీపీఎం ములుగు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బీరెడ్డి సాంబశివ అన్నారు. మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో శుక్రవారం సీపీఎం సర్వసభ్య సమావేశాన్ని జెజ్జరి దామోదర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మురుగు నీరు బయటకు వెళ్లడానికి కాల్వలు లేకపోవడంతో దోమలవ్యాప్తి పెరుగుతుందన్నారు. దీంతో ప్రజలకు జ్వరాల వంటి రుగ్మతలు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో బ్లీచింగ్ ఫౌడర్ చల్లడానికి కూడా డబ్బులు రావడం లేదని ప్రభుత్వం జీపీలకు నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కొన్ని గ్రామాల్లో వీధిలైట్లు లేక ప్రజలు చీకట్లోనే మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి రఘుపతిరావు, గుగ్గిళ్ల దేవయ్య, కృష్ణబాబు, భూలక్ష్మి, కుమారి, సౌమ్య, ప్రసాద్, నాగలక్ష్మి, చంద్రశేఖర్, నరేశ్, శాంతకుమారి, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివ

సీఎం క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ శ్రీదేవి

ములుగు: మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరు బాధాకరమని వెంటనే క్షమాపణలు చెప్పాలని మాజీ ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి సుధీర్ యాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం శాసనసభలో మహిళలపై ఈ విధంగా మాట్లాడటం చాలా బాధాకరమన్నారు. మహిళల పట్ల ఎలా నడుచుకోవాలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను చూసి నేర్చుకోవాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రవీందర్, రమేష్, రాములు, భాస్కర్, నాగేష్, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఎగురవేయాలి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మొగుళ్లపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగపురి రాజమౌళిగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని అమ్మ గార్డెన్‌లో శుక్రవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగపురి రాజమౌళిగౌడ్ మాట్లాడుతూ.. మండలంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మోరె రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చెవ్వ శేషగిరి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పోల్సాని తిరుపతిరావు, నాయకులు జన్నె మొగిలి, మాజీ జెడ్పీటీసీ కుమ్మరి సారయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ తిరుపతిరావు, తిరుపతి, వేణుగోపాల్‌రెడ్డి, బండారి శ్రీనివాస్, పెండ్లి మల్లారెడ్డి, చింతకింది రాజేశం, రాస భిక్షపతి గూడూరి మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముడతనపల్లి ప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మంథని అసెంబ్లీ కన్వీనర్ మల్క మోహన్‌రావు మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించి బలమైన ప్రతిపక్ష పార్టీగా ప్రజల తరుపున పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, అధికార ప్రతినిధి చొప్పరి రాజు, షేక్ నిషాన్ పాషా, రాజయ్య, గణేష్, రమేశ్, శ్రీకాంత్, రాజయ్య, రాజు పాల్గొన్నారు.